నీరు లేక నిలిచిన దమ్ము

- బంటుమిల్లి మండలంలో ఆయిల్ ఇంజిన్లపైనే సాగు
- కాలువపై రైతులు రాత్రి, పగలు పడిగాపులు
- ఇదే పరిస్థితి ఉంటే రైతులు కూలీలుగా మారే దుస్థితి


'బంటుమిల్లి'లో సాగునీరు లేక ఎండిపోయిన వెద చల్లిన పొలం

బంటుమిల్లి: లక్షలాది క్యూసెక్కుల సాగునీరు సముద్రం పాలవుతోంది కానీ కాలువ శివారు భూములకు మాత్రం సాగునీరందని దుస్థితి ఎదురవుతోంది. ఇప్పటికే వెదసాగు వేసిన నారు చనిపోవడంతో కొత్తగా నారు కొనలేక నారుమళ్లు పోసుకునేందుకు సిద్ధమయ్యారు. మరికొందరు ఉన్న పంటను కాపాడుకోవడానికి ఇంజిన్లు పెట్టి రాత్రి, పగలు కాలువపైనే ఆవాసాముంటున్నారు. నీరందక మరికొందరు దమ్ములు ఆపేశారు.

పెదపట్నం బ్రాంచి కాలువ పరిధిలో..

బంటుమిల్లి మండలం పెదపట్నం బ్రాంచి కాలువ పరిధిలో రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. బంటుమిల్లి ప్రధాన కాలువకు బంటుమిల్లి మండలంలోని బంటుమిల్లి, అర్తమూరు, కొర్లపాడు, మణిమేశ్వరం, బందరు మండలం, పెదపట్నం, కానూరు పంచాయితీల పరిధిలో దాదాపు 4వేల ఎకరాల్లో వరి సాగవుతోంది. ఈ కాలువ మెరక. దీంతో బంటుమిల్లి ప్రధాన కాలువకు 500 క్యూసెక్కుల నీరొస్తేనే పెదపట్నం కాలువకు నీరందే పరిస్థితి. సాగు మొదలైనప్పటి నుంచి కూడా నీరందని పరిస్థితి.

సరిపోని నీరు

ఇప్పటికే పలుదఫాలుగా నీటిని ఇంజిన్లు పెట్టి తోడుతున్నా నీరు సరిపోని పరిస్థితులు నెలకొన్నాయి. రూ.2 వేలు నుంచి రూ.3 వేలకుపైగా అదనపు పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని రైతులు ఆవేదన. ఇరిగేషన్ అధికారులు చెబుతున్న దానికి.. వాస్తవ పరిస్థితులకు భిన్నంగా ఉంది. అతి కొద్దిగా వస్తున్న నీటిని రైతులు రాత్రి, పగలు కాలువ కట్టలపైనే ఉంటూ వంతుల వారీగా ఇంజిన్లతో తోడుకుంటున్నారు. ఇంత దారుణమైన పరిస్థితులు గతంలో ఎన్నడూ రాలేదని రైతులు అంటున్నారు. నారు ధర రూ. 800 నుంచి రూ. 1200 వెళ్లడంతో నాట్లు వేసుకోవలసిన సమయంలో నారుమళ్లు పోసుకుంటున్నామని రైతులు వాపోతున్నారు.

ఎండిపోతున్నాయి

ప్రభుత్వం రెండో పంట దాళ్వా ఇస్తుందన్న నమ్మకంలేక సార్వా సాగు ఆలస్యమైనా ఫర్వాలేదని రైతులంటున్నారు. మండుతున్న ఎండలకు నీరు సరిపోని పరిస్థితిలో వెద పొలాలు ఎండిపోతున్నాయి. మండుతున్న ఎండలకు ఆయిల్ ఇంజిన్లతో నీరు తోడినా కాపాడుకోలేక వదిలేశామని పలువురు కౌలు రైతులు వాపోతున్నారు.


పెదపట్నం కాలువపై బోదెకు నీరు ఎక్కక పోవడంతో ఇంజన్లు ఏర్పాటు చేసుకున్న దృశ్యం

పొలాలు తుంగ, గడ్డితో బీడు భూములను తలపిస్తున్నాయి. నీరు సరఫరా పూర్తిగా లేకపోవడంతో దమ్ములు నిలిపేశారు. నారుమళ్లలో నారు ముదిరిపోతుందని, నాట్లు వేద్దామంటే నీరందని దుస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎప్పుడు నీరొచ్చినా దమ్ము చేసేందుకు సిద్ధంగా దమ్ము చక్రాలతో ట్రాక్టర్లను పొలాల్లోనే ఉంచారు.

పది ఎకరాల కోసం నారుమడి పోశా



పది ఎకరాలు భూమి కౌలుకు చేస్తా. అత్యధిక భాగం వెద చల్లా. సాగునీరు లేక ఎండిపోయింది. నారు కొని సాగు చేయడం కంటే నారు పోసుకోవడం మంచిదని భావించి రెండు రోజుల క్రితం బీపీటీ విత్తనాలు పోశా. పండినా పండకపోయిన యజమానికి ధాన్యం తోలాలి. ప్రభుత్వం ఆదుకోవాలి.

–ప్రత్తి నాగసిద్దయ్య, కౌలు రైతు, మణిమేశ్వరం, బంటుమిల్లి మండలం

ఇంత దారుణమైన పరిస్థితులు ఎన్నడూ రాలేదు



గతంలో నీరు ఎక్కువై తూములు మూసేవాళ్లం. ఇప్పుడు రైతులు అందరూ ఒకేసారి ఇంజిన్లు వేస్తే ఆ నీరు కూడా అందదు. బోదెలు తట్టుకోవని భావించి వంతుల వారీగా ఇంజిన్లు వేసుకుంటున్నాం. జూలై, ఆగస్టు నెలల్లో మొదట్లోనే ఎండలు మండిపోవడంతో నీటి ఎద్దడి వచ్చింది. దీంతో వెద చల్లిన పొలాలు కాపాడుకోవడానికి ఇంజిన్లు పెట్టక తప్పలేదు. కాలువకు అడ్డుపెడితే ఎక్కుతాయి అయితే దిగువ గ్రామాల రైతులు ఊరుకోరు. కాలులో నడుస్తున్న జాలుకే ఇంజిన్లు పెట్టుకుంటున్నాం. ఇదే పరిస్థితి ఉంటే రైతులు కూలీలుగా మారుతారు. ఎందుకంటే కూలీలకు బిరియాని, కూల్‌డ్రింక్స్‌లు, టిఫిన్లు పెట్టి వ్యవసాయం చేయిస్తున్నాం. మాకన్నా వారి పరిస్థితి నయం.

–చిల్లేటి కనకయ్య, కౌలు రైతు, మణిమేశ్వరం, బంటుమిల్లి మండలం

క్లుప్తంగా

అధిక ఉష్ణోగ్రతలతో వరి సాగులో అప్రమత్తం

పెడన: ప్రస్తుతం వరి సాగు అధిక ఉష్ణోగ్రతలను ఎదుర్కొంటోందని, అక్కడక్కడా మైట్ నష్టం కనిపిస్తోందని జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందని మచిలీపట్నం అగ్రికల్చర్ రైస్ రీసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్త డాక్టర్ కె.నాగేంద్రం అన్నారు. మంగళవారం నడుపూరు, కొంకేపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది పురస్కరించుకుని రైతులతో సమావేశమయ్యారు. పొలాలను పరిశీలించిన తర్వాత రైతులతో మాట్లాడుతూ వరి యాజమాన్య పద్ధతులపై సలహాలు సూచనలు తీసుకుని సాగు చేయాలన్నారు. ఎక్కువ వేడి వాతావరణంతో వరిలో మైట్ నష్టం గమనిస్తున్నామన్నారు. పెడన ఏవో ఎస్.జెన్నీ మాట్లాడుతూ రైతులు ఆగస్టు 15వ తేదీలోగా పంట బీమా పథకం నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీనివాసరావు, వెంకన్న బాబు, నాగేశ్వరరావు, రైతులు ల్గొన్నారు.

ట్రీ గార్డుల అందజేత



మచిలీపట్నంటౌన్: మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'పర్యావరణ పరిరక్షణ –మన అందరి బాధ్యత'లో భాగంగా నగరంలోని గో సంఘం వద్ద ఉన్న టిడ్కో కాలనీకి ట్రీ గార్డులను మంగళవారం అందజేశారు. సుమారు రూ. 17 వేలు విలువచేసే 15 సిమెంట్ ట్రీ గార్డులు, మొక్కలను పశువుల నుంచి సంరక్షించడానికి టిడ్కో గృహాల కార్యనిర్వాహక బృంద సభ్యులకు ఫౌండేషన్ ప్రతినిధులు అందజేశారు.మైత్రి ఫౌండేషన్ అధ్యక్షుడు కేసాని వేణు కుమార్, ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కాసాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

అవనిగడ్డ: రైతులందరికీ యూరియా అందుబాటులో ఉందని కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు అమ్మినా చర్యలు తీసుకుంటామని ఏడీఏ జయప్రద హెచ్చరించారు. మంగళవారం ఆమె ఏడీఏ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అవనిగడ్డ నియోజక వర్గంలో ఇప్పటి వరకూ నాట్లు పడిన పొలాలకు యూరియా 2,056 టన్నులు అవసరం కాగా, పీఏసీఎస్‌లలో 1,056 టన్నులు, ప్రైవేటు డీలర్ల వద్ద 2,678 టన్నులు కలిపి మొత్తం 3,736 టన్నులు ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ వచ్చినట్టు చెప్పారు.

నిత్యాన్నదానానికి రూ.50 వేల విరాళం



మోపిదేవి: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి భక్తులు గుడివాడ వాస్తవ్యులు సీబీ సుబ్రహ్మణ్యం రూ. 50,001 విరాళంగా అందజేశారు. ఉదయం ఆలయానికి చేరుకున్న వారి కుటుంబ సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం ఈ విరాళాన్ని ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు అందచేశారు. సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

మంగళాపురం పీఏసీఎస్‌కు ఉత్తమ ప్రతిభా అవార్డు



చల్లపల్లి: మంగళాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్)కు 2024–2025కి ఉత్తమ ప్రతిభా అవార్డు లభించింది. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య ఫంక్షన్‌హాల్లో సోమవారం ఆప్కాబ్ 62వ వార్షికోత్సవాలు నిర్వహించారు. సహకార శాఖా మంత్రి కె.అచ్చెన్నాయుడు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, సీఈఓ శ్యామ్ మనోహర్ నుంచి పీఏసీఎస్ కార్యదర్శి చంద్ర రవి అవార్డు అందుకున్నారు.

'మన మిత్ర'పై అవగాహన

పెడన: పురపాలక సంఘ పరిధిలో ఉన్న సమస్యలను 'మన మిత్ర' యాప్‌తో అధికారులకు నేరుగా తెలియజేయవచ్చని మున్సిపల్ కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డి అన్నారు. మన మిత్ర యాప్‌పై మంగళవారం పురప్రజలకు అవగాహన కల్పించడానికి పట్టణంలో ప్రధాన రహదారుల వెంట ర్యాలీ నిర్వహిస్తూ కరపత్రాలను దుకాణాదారులకు పంచారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మట్టా రాజా, కార్యాలయ సిబ్బంది, సచివాలయాల ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఘంటసాల: ఘంటసాల మండలంలో మన మిత్ర వాట్సాప్ సేవలపై మంగళవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఘంటసాలపాలెం, తెలుగురావుపాలెం, అచ్చెంపాలెం గ్రామాల్లో సర్పంచులు దోనె రజని, రాచూరి ప్రసాద్ బాబు, గాజుల నాగ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత



కోనేరుసెంటర్: కృష్ణా జిల్లా హోంగార్డ్స్ విభాగంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల పదవీ విరమణ పొందిన వై.వెంకటేశ్వరమ్మకు వన్‌డే కాంట్రిబ్యూషన్ చెక్కును కృష్ణా ఎస్పీ ఆర్.గంగాధరరావు మంగళవారం అందజేశారు. ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రూ. 3,79,140 వన్‌డే కాంట్రిబ్యూషన్ చెక్కును వెంకటేశ్వరమ్మకు అందజేసిన ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో హోంగార్డుల ఐక్యత అభినందనీయమన్నారు. హోంగార్డ్స్ విభాగం పోలీసుశాఖలో ముఖ్య భాగమేనని పదవీ విరమణ పొందిన సిబ్బందికి భవిష్యత్తులో పోలీసు శాఖ తరఫున ఎలాంటి సాయం కావాలన్నా తమను కలిసి సాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రవికుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

అవనిగడ్డ: విద్యుత్ తీగలకు అడ్డువచ్చిన చెట్ల కొమ్మలను తొలగించనుండటంతో కోడూరు రోడ్డు పాత సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం నాలుగు గంటల పాటు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఉయ్యూరు డివిజన్ ఈఈ డి.కృష్ణనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని దక్షిణ చిరువోలులంక, రామచంద్రపురం, సరదాకోడు, మేడిలంక, అయ్యవారిపాలెం గ్రామ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల మధ్య కరెంట్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ప్రజలపై అదనపు చార్జీల భారం వద్దు

అవనిగడ్డ, మచిలీపట్నం, పెడనలో 'విద్యుత్' నిరసనలు

మచిలీపట్నంటౌన్: ప్రజలపై విద్యుత్ అదనపు చార్జీల భారాలు వేయొద్దని వామపక్షాల నేతలు డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల దోపిడీ ఆపాలని, ప్రమాదకరమైన స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యాన మంగళవారం కోనేరుసెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి నేతలు విద్యుత్ బిల్లులు పెంచం.. స్మార్ట్ మీటర్లు అసలే ఉండవు.. కరెంట్ చార్జీలు తగ్గిస్తాం.. అంటూ గొప్పలు చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చాక అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. సర్దుబాటు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అదనపు చార్జీలు వేస్తోందని విమర్శించారు. ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులను ఉక్కిరిబిక్కిరి చేస్తోందన్నారు. నిరసన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నరసింహారావు, నేతలు కొడాలి శర్మ, బి.సుబ్రహ్మణ్యం, టి.చంద్రపాల్, కొడాలి సుజాత, రాజేష్, డి.నిర్మల, ఎం.రామారావు తదితరులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: విద్యుత్ వినియోగదారులపై పడుతున్న అదనపు చార్జీలు ఎత్తేయాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. మల్లపరాజుగూడెం, పెదతుమ్మిడి, బంటుమిల్లి, ఆముదాలపల్లి, ములపర్రు, నాగేశ్వరరావుపేట, పెందుర్రు సచివాలయాల వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో వినతి పత్రాలు అందజేశారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్లో నిరసన తెలిపి ప్రభుత్వ మొండి వైఖరిపై ధ్వజమెత్తారు.

కోడూరు: విద్యుత్ చార్జీల భారాన్ని తగిస్తానని హామీ ఇచ్చి అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వం, నేడు ప్రజల నుంచి వివిధ చార్జీల పేరుతో దోపిడీ చేస్తోందని ప్రజాసంఘాల ఐక్యవేదిక నేతలు మండిపడ్డారు. మంగళవారం ప్రజాసంఘాల నేతలు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. నేతలు పోలాబత్తిన మోహనరావు, కొప్పనాతి తాతయ్య, పోలినాయుడు పాల్గొన్నారు.


విద్యుత్ భారాలు తగ్గించాలని నిరసన తెలుపుతున్న సీపీఎం, సీపీఐ నాయకులు

మోపిదేవి: మోపిదేవి ప్రధాన సెంటర్‌లో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ప్రజా వేదిక ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ రాజశేఖర్ ఇతర నేతలు ఏఈ పాండురంగారావుకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు బండి రామకృష్ణ, ఎం.సురేష్, దోని సహదేవుడు, కర్ర వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు:ద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు బిగించవద్దని కోరుతూ సీఐటీయూ కృష్ణా జిల్లా సహాయ కార్యదర్శి కె.వి.గోపాలకృష్ణ, గూడూరు మండల సీఐటీయూ కార్యదర్శి మస్తాన్ బాషాతో కలసి మంగళవారం గూడూరు విద్యుత్ శాఖ ఏఈ ఎం.రాజేష్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం పనిచేస్తున్న మీటర్ల స్థానంలో రూ.18వేల విలువైన స్మార్ట్ మీటర్లను పెట్టి, ఆ మీటర్ల డబ్బులు కూడా వినియోగదారుల నుంచి గుంజాలనుకోవడం దారుణమని చెప్పారు.


చల్లపల్లి ఏడీఈ శివనాగేశ్వరరావుకు వినతిపత్రం సమర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు


పెడన విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

బాదుడు ఆపకపోతే ఉద్యమం తీవ్రం

పెడన: సీఎం చంద్రబాబు ప్రజలపై విద్యుత్ చార్జీల బాదుడు స్మార్ట్ మీటర్లు రూపంలో బాదడానికి సిద్ధమయ్యారని దీన్ని ఆపకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని ప్రజాసంఘాల నేతలు స్పష్టం చేశారు. పెడన తోటమూల వద్ద ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం, సీపీఐ, సీఐటీయూ తదితర సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి గౌరు రాజు, సీఐటీయూ నేతలు పంచల రామనరసింహారావు, పుట్లపేరా లింగం తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల: ఘంటసాల విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద కరెంట్ చార్జీల భారాన్ని తగ్గించాలని, మా ఇంటికి స్మార్ట్ మీటర్ వద్దని అనే నినాదంతో కూడిన అర్జీని ముఖ్యమంత్రి పేరున విద్యుత్ శాఖ ఏఈ రవి కుమార్‌కు ప్రజా సంఘాల నేతలు మంగళవారం అందించారు. కల్లుగీత కార్మిక సంఘం నేత వాకా రామచంద్రరావు మేడంకి వెంకటేశ్వరరావు, బలే రమేష్, తదితరులు పాల్గొన్నారు.

తగ్గిస్తానని ఇలా పెంచుతారా!

చల్లపల్లి: ఎన్నికల వేళ విద్యుత్ భారాన్ని తగ్గిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు ఇలా చార్జీలు పెంచుకుంటూ పోవడం ఎంతవరకూ సమంజసమని పలు ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక విద్యుత్ సబ్‌డివిజన్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నేతలు మాట్లాడుతూ గత 12 నెలల కాలంలో ఏకంగా రూ.15,485 కోట్లు విద్యుత్ చార్జీల భారం ప్రజలపై పడిందన్నారు. పాత రీడింగ్ పద్ధతినే అమలుచేయాలని కోరుతూ ఏడీఈ శివనాగేశ్వరరావుకు వినతిపత్రాన్ని సమర్పించారు. వాణిజ్య, వర్తక సంఘం నాయకులు వరదా హరి గోపాల్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, ఇతర నేతలు పాల్గొన్నారు.

పోలీసు సెక్షన్లపై అవగాహన అవసరం

కోనేరుసెంటర్: పోలీసు సిబ్బంది పాత సెక్షన్‌లతో పాటు అమలులోకి వచ్చే కొత్త సెక్షన్‌లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని డీటీసీ డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలోని కానిస్టేబుల్ నుంచి ఏఎస్సై స్థాయి వరకు ఉన్న సిబ్బందికి నూతనంగా అమలులోకి వచ్చిన సెక్షన్లపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు సిబ్బంది సెక్షన్‌లతో పాటు వాటిని అమలు చేసే విధానంపై తెలుసుకుని ఉండాలన్నారు. కొత్త సెక్షన్‌ల ప్రకారం ముఖ్యమైన కేసుల్లో దర్యాప్తు ఎలా చేయించాలి, ఆధారాలు ఎలా సేకరించాలి, సాంకేతికపరంగా విచారణ ఎలా మెరుగుపరచుకోవాలి వంటి అంశాలపై అవగాహన కలిగించారు. ఈ శిక్షణ తరగతుల ద్వారా పోలీసు వ్యవస్థలో నైపుణ్యాలను పెంపొందించుకుని ప్రజలకు మరింత సమర్థమైన సేవలను అందించే విధానాన్ని వివరించారు. డీటీసీ సీఐ రఘు కొత్త సెక్షన్లపై సిబ్బందికి అవగాహన కలిగించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ స్థాయి నుంచి ఏఎస్సై స్థాయి వరకు సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ రఘు

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

లంకపల్లి(ఘంటసాల): ఆరునెలల చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తే ఆరోగ్యంగా ఉంటారని ఘంటసాల ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ టి.రమా నాగమణి అన్నారు. ఘంటసాల మండలం లంకపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమా నాగమణి మాట్లాడుతూ ఆరు నెలలు దాటిన చిన్నారులకు అందించాల్సిన అనుబంధ ఆహారం గురించి తెలిపారు. అనంతరం వెల్ బేబీ షో నిర్వహించి చిన్నారులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ డి.విజయలక్ష్మి, కె.పద్మారావు, ఎంఎస్కే అలేఖ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో..

ఘంటసాల కేవీకే ఆధ్వర్యంలోని తాడేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి.కృష్ణవేణి, సెక్టార్ సూపర్‌వైజర్ పీఆర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


లంకపల్లిలో వెల్‌బేబీషోలో చిన్నారులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

రైతులు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి

కె. కొత్తపాలెం(మోపిదేవి): ఖరీఫ్ సాగులో వరి పంటకు తప్పని సరిగా ఈ క్రాపు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.హెప్సిబారాణి తెలిపారు. కె. కొత్తపాలెంలో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా పంట పొలాలను వ్యవసాయాధికారులు పరిశీలించిన అనంతరం రైతులతో మాట్లాడారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద వరి, పసుపు పంటలను సాగు చేస్తున్న రైతులు నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి కౌలు రైతులతో సహా రైతులందరూ ఈ బీమా పథకం కింద పసుపు పంటకు రూ. 1,110, వరి పంటకు రూ. 830 చెల్లించి బీమా పొందాలన్నారు.

కృత్తివెన్ను: ఉద్యానవన పంటలైన కొబ్బరి సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి లాభాలు గడించవచ్చని ఆ శాఖాధికారి జ్యోతి అన్నారు. మంగళవారం చినగొల్లపాలెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కొబ్బరి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సునీల్, ఏవో మాధురీకిరణ్, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.


కె. కొత్తపాలెంలో పొలం పిలుస్తోందిలో మాట్లాడుతున్న ఏవో హెప్సిబారాణి

పంటల్లో సమగ్ర సస్యరక్షణ కీలకం

ఘంటసాల: వివిధ పంటల్లో తొలి దశలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులు కీలకమైనవని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి తెలిపారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం, విజయవాడ కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో వరి, మినుము పంటలలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రెండు రోజుల శిక్షణ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ సేద్య, యాంత్రిక, జీవ నియంత్రణ పద్ధతులను అవలంబించుకుంటూ రసాయన మందుల వినియోగం తగ్గిస్తే అధిక లాభాలు సాధించవచ్చని తెలిపారు. లింగాకర్షక బుట్టల వినియోగం, జిగురు అట్టలు, జీవ నియంత్రణ పద్ధతుల వినియోగం, కలిగే లాభాలు, జీవన ఎరువుల ప్రాముఖ్యత, పిచికారీ సమయంలో పాటించాల్సిన మెలకువలు, తదితర అంశాలను తెలియజేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు కె.రేవతి, ఎం.వెంకటలక్ష్మి, కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం డెప్యూటీ డైరెక్టర్ మనోజ్ గోస్వామి, సస్యరక్షణ అధికారి చౌదరి, మొవ్వ సబ్ డివిజన్ ఏడీఏ ఎస్.శ్యామల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సుధారాణి

రేపు హాకీ క్రీడాకారుల ఎంపిక

మచిలీపట్నంఅర్బన్: కృష్ణాజిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో హాకీ క్రీడాకారుల ఎంపికకు గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 7వ తేదీన ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు హాకీ విభాగం కృష్ణా కార్యదర్శి శ్రవణం హరికృష్ణ తెలిపారు. ఎంపికల్లో 22 ఏళ్ల లోపు పురుషులు, మహిళలు అర్హులని పేర్కొన్నారు. క్రీడాకారుల వయసు నిర్ధారణకు ఆధార్ కార్డు తప్పనిసరని తెలిపారు. ఎంపికైన వారికి జిల్లాకు ప్రాతినిధ్యం వహించే అవకాశం లభిస్తుందని వెల్లడించారు. వివరాలకు 7013786846 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

ఆన్‌కాల్ డ్రైవర్లకు దరఖాస్తుల ఆహ్వానం

అవనిగడ్డ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ స్థానిక డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్లగా విధులు నిర్వహించడానికి ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని డిపో మేనేజర్ కె.హనుమంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెవీ వెహికల్ లైసెన్స్ పొందిన తర్వాత 18 నెలలు భారీ వాహనాలు నడిపిన అనుభవం ఉండాలని ఆయన సూచించారు. ఆసక్తిగల వారు స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు. ఎంపికైన వారికి ప్రత్యేక శిక్షణ అనంతరం ఆర్టీసీ సర్వీసులకు డ్యూటీలు కేటాయిస్తామని డిపో మేనేజర్ హనుమంతరావు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న డ్రైవర్లు ఆర్టీసీ డిపోలో సంప్రదించాలని ఆయన సూచించారు.

శ్యామలాంబకు ప్రత్యేక పూజలు

పెడన: శ్రావణ మాసం సందర్భంగా పట్టణంలోని శ్రీశ్యామలాంబ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణ మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి 11 కేజీలతో భస్మాభిషేకం, అమ్మవారికి 11 కేజీల పసుపు, 108 కేజీల కుంకుమతో అభిషేకాలు, 108 మంది సుహాసినిలతో సామూహిక కుంకుమార్చనలు అత్యంత భక్తిశ్రద్ధలతో చేశారు. భజన గుడి నుంచి అమ్మవారికి పసుపు, కుంకుమలతో ఊరేగింపుగా బయల్దేరి శ్యామలాంబ ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. బొడ్డు దీక్షానందుడు, భండారు ఆనందప్రసాద్, కర్ణామోహనరావు, బట్టు కిషోర్, అర్చకులు గూడూరు రత్నాకర్ పర్యవేక్షణలో పూజలు చేశారు.


పసుపు, కుంకుమలతో ఊరేగింపుగా వెళ్తున్న సుహాసినిలు, భక్తులు